# బాల్ ఈజ్ ఇన్ మై కోర్ట్

మల్లి భానుమూర్తి

సాయంత్రం ఆరు గంటలు ఇందిరా పార్క్ వెనక్కి వాలి ఏటవాలుగా తిరుపతి గోవిందరాజుల స్వామి విగ్రహం భోజులో పడుకున్నాడు మూర్తి గోవిందరాజులు వచ్చే పోయే ఆడభక్తుల్ని ఆపాదమస్తకం తిలకిస్తాడో లేదో తెలీదు గాని మూర్తి మాత్రం కనుచూపు ఆ వృత్తంలో ఉన్న ప్రతి స్త్రీని వీలయినంత పరిశీలనగా చూస్తున్నాడు

అప్పుడతని పక్క ఓ అమ్మాయి కూర్చొనుంది ఆమె ఊర్మిళ

దిక్కులు చూస్తున్న మూర్తికి పక్కనున్న అమ్మాయి ప్రేమికురాలు – ప్రేమికురాలు పక్కనున్న అతను అటూ ఇటూ పోయేవాళ్ళని చూస్తున్నాడంటే ఆ ప్రేమ ముదిరి పెళ్ళి వరకూ వచ్చిందని, ఆ పెళ్ళికి పెద్ద అవాంతరం వొచ్చిందని, అందులో అతనికేం బాధ్యత లేదని అతను భావిస్తున్నాడని మనం భావించవచ్చు

శరీరాన్ని మోస్తోన్న చెయ్యి నొప్పి అని అరవడంతో వెనక్కి వాలి వెల్లకిలా పడుకున్నాడు మూర్తి అలా పడుకుంటూ ఓసారి ఊర్మిళ వంక చూసి నవ్వాడు ఆ నవ్వులో కసాయితనం ఉంది అలా నవ్వుతున్నప్పుడు అతని ముఖంలో సరదాగా మేక పిసికి ఆనందించే శాడిజం తొణికిసలాడింది పైకి చూస్తోన్న అతని ముఖం ఇప్పుడు చిద్విలాసంగా ఉంది ఎలక్కి ప్రాణసంకటం కల్పించి చెలగాటమాడే పిల్లిలా ఉన్నాడిప్పుడు మూర్తి

ఏం మాట్లాడవేంటి? అంది ముందుగా ఊర్మిళ అప్పటికి ఆమె వచ్చి అరగంట అయ్యింది ఈ పూట ఇదే మొదటి మాట మళ్ళీ నవ్వాడు చిరునవ్వు ఏడ్చేవాడు ఇంకా ఏడిస్తే చూడాలన్న ఆసక్తిగల నవ్వు

'నన్నేం చెయ్యమంటావ్ అన్నాడు నిస్సహాయత ప్రకటిస్తూ – అది నటన అని, నేను చాలా అమాయకుడనని అంటూ ప్రాణాలు తీసింది నా చేతులే గాని తీయించింది ఆ దేవుడే అనగల కర్మ సిద్ధాంతి మూర్తి అని స్పష్టంగా ఊర్మిళకు అర్థమయింది

అతని మీద చెప్పరానంత అసహ్యమేసింది ఆమె రుస రుసల్లో ఓ సాధారణ ఆడపిల్ల అమాయకత ఉంది మొగుణ్ణి కొనుక్కోలేని బీద పిల్ల బతుకు భయం ఉంది మగాడి ప్రేమ మాటలు నమ్మి ఇప్పుడతను గోతిలోకి తోసేయబోతున్నాడని గుర్తించిన గుండె కోత ఉంది వలలో చిక్కాక తప్పుకోవడానికి పెనుగులాడి మరింతగా వలలో బిగుసుకు పోయిన బంగారు పిట్ట ఆర్తనాదం ఉంది ప్రేమికుడు తడి గుడ్డ మెడ చుట్టూ అందంగా చుడుతున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఉంది

కట్నం లేందే మన పెళ్ళి కుదరదని మీ నాన్నగారు చెప్పారట . అంది ఊర్మిళ ఆ సంగతి ఊర్మిళను ప్రేమించక ముందే, అంతకు ముందు శారద, కాంతి, వనజ, సరోజ, వగైరా వగైరాలకు ప్రేమిస్తున్నానంటూ ఉత్తరాలు రాయక ముందే మూర్తికి తెలుసు

ఆ సంగతి ఊర్మిళకు తెలీదు

అందుకే ప్రేమిస్తున్నాను అంటే నమ్మింది ప్రేమించేది పెళ్ళి చేసుకోవడానికి అనుకొనే అజ్ఞాని ఊర్మిళ థ్రిల్లు కోసం ప్రేమిస్తారని, 'ఓ ఆడపిల్ల నన్ను ప్రేమిస్తోంది' అని సాటి మగాళ్ళ ముందు చెప్పుకోవడానికి ప్రేమిస్తారని ఊర్మిళకు తెలియదు అలాంటి వాళ్ళలో మూర్తి ఒకడని కూడా తెలియదు మూర్తి సినిమాల గురించి, రాజకీయాల గురించి, లెక్చరర్లు, ఫ్రెండ్సు గురించి చెత్త గురించి చెదారం గురించి మాట్లాడుతాడు గాని పెళ్ళి గురించి మాట్లాడడని మధ్యతరగతి ఆడపిల్ల ఊర్మిళ త్వరలో నే గుర్తించింది తర్వాత తనే అడిగింది పెళ్ళి సంగతేమిటి? అని

"అప్పుడు తెలిసింది కట్నం కొట్టే ఇనుప కమ్మి దెబ్బల రుచి

ప్రేమ కదా కట్నం ఉండదనుకుంది అమాయకురాలు

మన పెళ్ళి మా వాళ్ళకి ఇష్టమే ఊర్మిళా కాని కట్నం అడుగుతున్నారు నన్నేం చెయ్యమంటావ్ ' అని మూర్తి అన్నప్పుడు ఆమెకతను కోటి పడగల కాలసర్పంలా తోచాడు తన స్థాయివాడిని చేసుకోడానికి వాళ్ళిద్దరి ప్రేమ అప్పటికే ఊరంతా తెల్సింది ఇతన్నే పెళ్ళి చేసుకోవడానికి అతన్ని కొనగల దమ్ము ఊర్మిళకి లేదు

మా వాళ్ళను కాదని నేను ఏమీ చెయ్యలేను అని మూర్తి ఊర్మిళ ఏడ్చి ఏడ్చి ఎక్కిళ్ళు పెడుతున్నప్పుడు చెప్పాడు

చురుగ్గా చూసింది

'భలే వాడివి ఎందుకు చెయ్యలేవూ రీములకొద్దీ లవ్ లెటర్స్ రాయగలవు వెధవ నవలల్లో, దరిద్రపు సినిమాల్లో చెప్పినట్టు, ఆడపిల్ల కళ్ళలోకి ప్రేమగా, లాలనగా, సెక్సీగా చూడగలవు నీటుగా తయారై అందమయిన కబుర్లతో బులిపించగలవు లెక్చరర్లపై జోకులేయగలవు సైకిల్‌తో ఆడపిల్లలకి డాష్‌లిచ్చి హీరోయిజం ప్రదర్శించగలవు వినయంకొద్దీ అలా అన్నావు గాని ఈ నీ శక్తియుక్తులు నీకూ తెలుసు మై డియర్ మూర్తీ అనలేదు ఊర్మిళ

మరి ఏం చెయ్యాలో చెప్పు అంది చేత చిక్కిన ఆవును ఆప్యాయంగా నాకిన పులిలా ఊర్మిళను హత్తుకున్నాడు మూర్తి

నాకు లక్షలు ఇస్తామని సంబంధాలు వస్తున్నాయి అయినా ఉద్యోగం వచ్చే వరకు మా నాన్న నాకు పెళ్ళి చెయ్యడు నేను మాత్రం నిన్నే చేసుకుంటాను అని తెగేసి చెప్పాను మీ నాన్నను వెళ్ళి కలవమను ఇంతే ఇవ్వగలను అనమను మా ఫాదర్ వొప్పుకుంటారు నాకా నమ్మకం ఉంది అన్నాడు

చెప్పింది చేయడం తప్ప తాను ఆలోచించగలిగి, ఆలోచించింది ఆచరించగలిగే స్థితిలో ఊర్మిళ లేదు

తండ్రితో మూర్తి చెప్పిన వైనం చెప్పింది ఊర్మిళ తండ్రి ఐదుగురు ఆడపిల్లల తండ్రి సాక్షాత్తు దరిద్ర నారాయణుని అపరావతారం ఈ సొసైటి అతనికి విధించిన శిక్ష ఏమిటంటే కూతుళ్ళ పెళ్ళి కోసం ఏ అధమాధమమైన పనైనా చేయవలసిన స్థితి కల్పించడం ఎలాగోలా ఇద్దరికి పెళ్ళి చేశాడు ఇంకా మూడు కుంపట్లు గుండెల మీదున్నాయి

ఊర్మిళ చెప్పినట్లు మూర్తి తండ్రిని కలిశాడు ఊర్మిళ తండ్రి

అమెరికా అధ్యక్షుడు ఆంధ్రా కుమ్మవాడ్ని చూసినట్లు చూశాడు మూర్తి తండ్రి


వంకాయలు కొనేవాడు వజ్రాలు కొనడానికి వచ్చినట్లు ఈసడించాడు వేలం పాటలో నీ శక్తి కొలది రేటు పలకొచ్చు కాని దేవుడి పాటకంటే తక్కువ పాడడానికి రూల్స్ ఒప్పుకోవు మూర్తిని కొనడానికి దేవుడి పాట లక్షల్లో ఉంది

ఇది టెంపరరీ రేటు ఆడికి ఉజ్జోగం వొచ్చాకగాని పెళ్ళి చెయ్యను అప్పుడు రేటు అప్పుడే అన్నాడు మూర్తి తండ్రి

అప్పుడు ఇప్పుడు ఏ రేటు ఉన్నా ఊర్మిళ తండ్రి వద్ద చెల్లని పావలాలు కూడా లేవు " అస్సలు పెళ్ళి పురోహితుడికి తాంబూలంలో పెట్టడానికైనా ఓ రూపాయి ఉందా?" అని మూర్తి తండ్రి ఈసడించి పంపేశాడు

ఆ కోపంతో ఉందావేళ ఊర్మిళ అసలు మగ జాతినే తిడదామని, సినిమాల్లో హీరోయిన్ మాదిరి పుంజీడు డైలాగులు చెప్పి మూర్తిని చంపుతామని పార్క్‌కొచ్చింది కాని ముక్కు పుటాలు పీటిక్కడం మినహా ఏమీ చెయ్యలేకపోయింది చాలా అమాయకంగా, జరిగినదానికి జరుగుతున్న దానికి తానెంతో బాధపడుతున్నట్టుగా భారీగా జీవించాడు మూర్తి

"వైజాగ్ నుంచి ఓ సంబంధం వచ్చింది నాకు జాబ్ ఇప్పించి రెండు లక్షలు కట్నం ఇస్తారట. మా ఫాదరు ఆయన చిన్ననాటి ఫ్రెండ్సట " అన్నాడు బాధగా ఊర్మిళ గుండెల్లో ఆటంబాంబు పడి పేలినప్పుడు కళ్ళ వెంట నీళ్ళు రాలేదు నిప్పులు కురవడంతో రెప్పలు కాలాయి



ఇది జరిగి ఓ నెలయ్యింది.

–నెల తర్వాత ఇవ్వాళ..

ఆంధ్రా బ్యాంకు... ఉదయం పన్నెరడు గంటలు .

బ్యాంకంతా హడావిడిగా ఉంది. కాష్మీరీ వాతావరణం... ఏ సి చల్లదనం.. ఉద్యోగులు, కష్టమర్లు అంతా నీటుగా ఈ దేశం అంతా ఇలాగే ఉందేమోనన్న భ్రమ పుట్టిస్తూ ఆహ్లాదంగా కనిపిస్తున్నారు

మూర్తి బ్యాంకులో అడుగుపెట్టాడు, అటూ ఇటూ మెల్లగా వెదుకుతున్నాడు. చర్చిలోకి ప్రవేశించిన పురోహితుడిలా, ఎవరైనా చూస్తే ఊరుకోరేమో అన్న ఫీలింగ్‌తోనూ కాస్త బిడియంతోనూ అతనున్నాడు

నెలనాటి ధీమా లేదు . కళ్ళలో దైన్యం లాంటిది ఉంది గాని అది సహజంగా వచ్చింది కాదు తెచ్చి పెట్టుకున్నది ఆ దైన్యత వెనక క్రౌర్యం వున్నది. వీలయితే ఈ దైన్యంతో దగ్గరకు లాగి ఆ క్రౌర్యంతో కాటేద్దామన్న తత్వం ముఖంలో పల్చగా కదలాడుతోంది దూరంగా చూసి వెదుకుతున్నదేదో కనిపించినట్టు ఆగాడు. పరిశీలనగా అటే చూశాడు .. ఆ చూపులో చూడరానిదేదో కళ్ళలో పడ్డట్టు కోపం లాంటిది ఉంది

కదిలి మెల్లగా అటే చూస్తూ వెళ్ళాడు.

ఊర్మిళ ఎవరితోనో మాట్లాడుతూంది . మగవాడితో. . బహుశా పెళ్ళికాని కుర్రాడితో .. ఏదో ఉద్యోగం వెలగబెట్టడం వల్ల మూర్తికంటే ధీమాగా కనిపిస్తున్న వాడితో.

ఈ ఊర్మిళ నెల క్రిందటి ఊర్మిళ కాదు.. ఆమె ముఖంలో ఇప్పుడు మధ్యాహ్నపు సూర్యుడికాంతి ఉంది పౌర్ణమి వెన్నెల జిలుగు ఉంది– సెలయేరు కెరటాల నవ్వులున్నాయి. మల్లె జాజి మందారాల ఫ్రెష్‌నెస్ ఉంది.

జాగ్రత్తగా కట్టుకున్న కాటన్ చీర మాచింగ్ జాకెట్ అందంగా దువ్వి పూలు ముడిచిన తల . గ్రేస్‌తో కూడిన నవ్వు–

ఆమె ఇప్పుడు మామూలు ఊర్మిళ కాదు. ఉద్యోగి ఊర్మిళ. నెలకు వెయ్యి రూపాయల సంపాదనతో తనకో వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్న ఊర్మిళ

నిలబడ్డాడు కాస్త ఇవతలగా.. మాట్లాడుతూ మూర్తిని చూసి చూడనట్టుగా జాత్తు సవరించుకొని స్టైల్‌గా తల తిప్పి అతనితో గడగడా మాట్లాడుతోంది... సున్నితంగా నవ్వుతోంది.

పురుష అహం పొంగింది కాని తండ్రి మాటలు గుర్తొచ్చాయి

"ఆ పిల్ల ఇప్పుడు బంగారు గుడ్లు పెట్టే బాతు ఉద్యోగం సద్యోగం లేని నీకు పిల్ల నివ్వడానికి దాని బాబు ఒప్పుకోవడం లేదు. ప్రేమ దోమ అని ఏడ్వావుగా. . పో, పోయి ఆ పిల్లనెలాగైనా లో బరచుకో. "

ఎవరో కష్టమర్ ఏదో అడిగాడు హుందాగా నవ్వి అతనికి సమాధానం చెప్పి మళ్ళీ ఆ యువకుడితో కబుర్లు కంటిన్యూ చేసింది.

పది నిముషాలు చూశాడు మూర్తి.

ముందుకొచ్చి 'ఊర్మిళా" అన్నాడు అప్పుడే చూసినట్టు చూసింది ఏవిటన్నట్టు కనుబొమలు ఎగరేసి అంది, "ఏవిటి? అని.

"ఏవిటి?" అంటే ఏవనాలో తెలీలేదు మూర్తికి. లవర్‌ను పట్టుకొని ఎందుకొచ్చావ్ ఏమిటి అంటే ఏ లవర్ మాత్రం ఖంగుతినడు. మూర్తీ తిన్నాడు.

"సీ. . మీట్.. మిస్టర్ రవికాంత్ మా, కో వర్కర్. మిస్టర్ రవి! . ఇతను మూర్తి"

"గ్లాడ్ టు మీట్యూ"

నైస్ మీటింగ్ యూ . నేను మళ్ళీ కలుస్తాను ఊర్మిళగారూ బై. "

"బై. " నవ్వి. ఆపేసి ముఖం నిర్వికారంగా మార్చి, "ఆc. చెప్పు మూర్తి. . ఏవంటున్నాడు మీ నాన్న?" వేళ్ళు సున్నితంగా విరుచుకుంటూ కుర్చీలో కూర్చునీ అడిగింది

నెల క్రితం పార్క్‌లో ఊర్మిళ ముఖం గుర్తొచ్చింది అతనికి .. ముక్కుపుటాలు అదిరాయి

నీతో కొంచెం మాట్లాడాలి ఊర్మిళా "

చిరాగ్గా ఇష్టంలేనట్టు చూసింది. ఇంతలో నే చిరునవ్వు నవ్వింది అచ్చు నెలనాడు పార్క్‌లో మూర్తిలా నవ్వింది

"అదిగో అక్కడ కూర్చో నేను ఐదు నిముషాల్లో వస్తాను .'

ఐదు నిముషాలకు కాదు ఇరవై నిముషాలకు వచ్చింది. కాస్త ఆవలగా అంటీ ముట్టనట్టుగా కూర్చుంది

మూర్తే ప్రారంభించాడు "నిన్న మా నాన్న మీ నాన్నగార్ని కలిశారట ." అంతే అన్నాడు . మీ నాన్న మా నాన్నని తిట్టాడని, దెప్పాడని, పో పొమ్మన్నాడని మూర్తి చెప్పలేదు . ఏం జరిగిందో ఇద్దరికీ తెలుసు.

"ఊ రెండు నిముషాలాగి అంది " ఎంత వరకూ వచ్చింది నీ పెళ్ళి విషయం?"

'నీ పెళ్ళేమిటి మన పెళ్ళి అను

### బాల్ ఈజ్ ఇన్ మై కోర్ట్

"అప్పుడెవరో మీ నాన్న ఫ్రెండ్.. రెండు లక్షలు .. ఉద్యోగం. . కూతురు... అని చెప్పావ్"

"సంబంధాలకేవిటిలే . ఆడపిల్లల తండ్రులు బోల్డుమంది అయినా ప్రేమ పెళ్ళి అనుకున్న వాడ్ని నాకవన్ని ఎందుకు.. నీ ప్రొబేషన్ అయ్యాక మంచి లగ్నాలున్నాయి ఊర్మిళా '

"అవునట రవి చెప్పాడు రవి అంటే ఇందాక పరిచయం చేశానే. అతనే బావున్నాడా నా హజ్బెండ్‌గా ఎలా ఉంటాడు?'

"ఊర్మిళా ."

"ఇష్ . ఇది బ్యాంకు ఇందిరా పార్క్ కాదు.. అతను నా చుట్టూ తిరుగుతున్నాడు నాకేమో మరీ నాతో పాటు క్లర్క్‌నే చేసుకోవటం ఇష్టంగా లేదు. ఇద్దరు ఆఫీసర్లు మా నాన్నగార్ని కలిశారు ఎవరో ఒకర్ని నిర్ణయించుకోవాలి..."

"ఊర్మిళా "

'ఇష్ అబ్బబ్బ . ప్రతి పెళ్ళికాని మగ వెధవ నా వంక చూసేవాడే మూర్తి. ఆఫీసర్లే వెంటబడుతుంటే ఇక ఉద్యోగం సద్యోగం లేని నజ్జుగాళ్ళనేం చూడను చెప్పు "

"ఊర్మిళా నేను నీ లవర్‌ని మనిద్దరం ప్రేమించి పెళ్ళి చేసుకుందామనుకున్నాం . '

నెల క్రితం పార్క్‌లో మూర్తి నవ్వినట్టు అమాయకంగా నవ్వి, 'ఏం చెయ్యమంటావ్ మూర్తీ .. నా చేతుల్లో ఏముంది. మా నాన్నగారి ఇష్టం .. ఆయన ఎవరిని చేసుకోమంటే వారినే చేసుకుంటాను.. "

పిచ్చెత్తినట్టు అరిచాడు మూర్తి "ఊర్మిళా '

అప్పుడరిచింది స్పష్టంగా ఊర్మిళా "డోంట్ టాక్ రబ్బిష్ ..' యూ బ్లడీ ఫూల్ గెటవుట్ ఫ్రం హియర్. ఓ ఆడపిల్లా కట్నంతో మగాడ్ని కొనుక్కోలేని ఓ అబల నీ పిచ్చి మాటలు నమ్మి నిన్ను ప్రేమించి నువ్వు కట్టే తాళికోసం నువ్వు పెట్టిన చిత్రహింసలు ఎన్ని భరించిందో గుర్తు తెచ్చుకో ఆ ఆడపిల్ల ఇవ్వాళ నీ తల్లో జేజమ్మలాంటి మగాడ్ని కొని ఇదిగో. ఈ వేంట్రుక్కి ముడేసుకోగలదు . అఫ్టాల్ నువ్వో నిరుద్యోగి వెధవ్విప్పుడు ప్రేమ దోమలాంటి నంగి వాగుడు వాగకిప్పుడు. ఫో ఇక్కడ్నుంచి . ఇక అమాయకత నటించకు. గెటౌట్ .

కళ్ళు బైర్లు కమ్మగా లేచి తడబడుతూ నడిచాడు మూర్తి.

తరతరాలుగా సాగుతున్న మగాడి దౌష్ట్యం మీద, జులుంమీద, మాయోపాయం మీద, ప్రేమలాంటి శాడిజం మీద ఆర్థిక స్వేచ్ఛతో పొందిన ఆత్మవిశ్వాసంతో కసి తీర్చుకున్న ఊర్మిళ గర్వంగా ఠీవిగా నడిచింది తన సీటు దగ్గరకు □




## కార్టూనిస్టులకు సూచనలు !

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !
- ★ వ్యాఖ్య చిన్నదిగా, క్లుప్తంగా వుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ మీదే పేరూ, వూరూ అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామాగల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను తిప్పి పంపడం జరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యత లేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకు ఐదారు వారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.